సెల్‌ఫోన్‌కు రక్షణ
'సంచార్ సాథి'
● అనధికార సిమ్‌లు, నకిలీ కనెక్షన్లకు చెక్
6

ఇంటి నుంచి
ఓటు లేనట్లే..
● పంచాయతీ ఎన్నికల్లో స్పష్టత కరువు
7

అక్రమ హోర్డింగ్‌లు..
యథేచ్ఛగా ఫ్లెక్సీలు

● చోద్యం చూస్తున్న అధికారులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా నగరంలో ఎక్కడ చూసినా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. రాజకీయ, వ్యాపార, ఇతర కార్యక్రమాల ప్రచారాలకు సంబంధించిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు నగర పాలక సంస్థ నుంచి అనుమతి తీసుకోవలసి ఉంటుంది. ప్రజలకు వాటితో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. హోర్డింగ్‌లు, కటౌట్లను ఏర్పాటు చేసే యాడ్ ఏజెన్సీలు, కాంట్రాక్టు సంస్థలు, వ్యక్తులు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తే సంబంధిత అధికారుల నుంచి, ప్రైవేట్ స్థలాలు, ఇళ్లపై ఏర్పాటు చేస్తే వాటి యజమానుల అనుమతి తీసుకోవాలి. నగర పాలక సంస్థకు బోర్డుల సైజు, ఏరియాను బట్టి నిర్దేశించిన ఫీజు చెల్లించాలి. హోర్డింగ్‌లు, కటౌట్లపై ఏ ఏజెన్సీ ఏర్పాటు చేసిందనే సమాచారాన్ని పొందుపరిచి నిర్ణీత సమయం ముగియగానే తొలగించాలి. గతంలో ఫ్లెక్సీలను బ్యాన్ చేయాలని, వాటి స్థానంలో బట్ట బ్యానర్లను ఏర్పాటు చేసుకోవాలని, వాటికి కూడా ముందస్తు అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అనుమతి పొందిన హోర్డింగ్‌లకు మున్సిపాలిటీలు నంబరింగ్ ఇవ్వాలని, అక్రమ హోర్డింగ్‌లను తొలగించాలని, హోర్డింగ్‌లకు సంబంధించిన కాంట్రాక్టు ఏజెన్సీల నుంచి రావలసిన బకాయిలను వసూలు చేయాలని ఆదేశించింది. ఫ్లెక్సీలను బ్యాన్ చేస్తామని, ప్రత్యామ్నాయ వ్యాపారాలు ఎంచుకోవాలంటూ అధికారులు ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు అవగాహన కల్పించారు. దీంతో కొంతమేర ఫ్లెక్సీలు తగ్గాయి.

● నిబంధనలకు విరుద్ధంగా..

కొన్ని నెలలుగా నగరంలో ఎక్కడ చూసినా హోర్డింగ్‌లు, కటౌట్లు, యథేచ్ఛగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు, డివైడర్ల వద్ద భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల అనుమతికి మించి ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేయడమే కాకుండా రోజుల తర బడి ఉంటున్నా వాటిని తొలగించే వారే లేకుండా పోయారు. ప్రధాన రహదారులతోపాటు నగరంలోని వీధులన్నింటిలో వ్యక్తిగత, ప్రచార ఫ్లెక్సీలకు అనుమతి తీసుకోవడం లేదు. దీంతో నగరపాలక సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. హోర్డింగ్‌లు కూడా అనుమతికి మించి ఏర్పాటు చేస్తున్నారని, సైజుల్లో కూడా తక్కువ చార్జీలు చెల్లించి పెద్దవి ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనలను పాటించని యాడ్ ఏజెన్సీల బోర్డులను, ఫ్లెక్సీలను తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు.



కరీంనగర్ చొక్కారావు జంక్షన్‌లో ఉన్న ఫ్లెక్సీలు



● నామమాత్రంగా ఏకగ్రీవాలు
● జిల్లా వ్యాప్తంగా ఆరుగురు సర్పంచ్‌లు, 586 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం
● మూడో విడత ఉపసంహరణకు రేపటి వరకు గడువు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లను, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రోత్సాహక నిధిని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ప్రజల స్పందన అంతంత మాత్రంగానే ఉంది. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలను ఇవ్వలేదు. దీంతో ఈసారి ఏకగ్రీవాలను ప్రజలు పట్టించుకోవడం లేదు. జిల్లాలో మూడు పంచాయతీల్లో మాత్రమే సర్పంచ్, వార్డుసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో మూడు పంచాయతీల్లో సర్పంచ్‌లను, వివిధ గ్రామ పంచాయతీల్లో 586 మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలో 316 పంచాయతీలు ఉండగా ఆయా పంచాయ తీల్లోని 316 సర్పంచ్, 2,940 వార్డుసభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

● ఏకగ్రీవమైన పంచాయతీలు

మొదటి విడతలో చొప్పదండి మండలం దేశాయిపేట గ్రామంలో వడ్లకొండ తిరుమల (ఇండిపెండెంట్) సర్పంచ్‌గా, మరో ఎనిమిది మంది వార్డుసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో విడతలో గన్నేరువరం మండలం పీచుపల్లి గ్రామపంచాయతీలో సామ రాజిరెడ్డి (బీజేపీ) సర్పంచ్‌గా, ఎనిమిది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడో విడతలో సైదాపూర్ మండలం ఆరెపల్లి గ్రామంలో వర్నె లావణ్య (ఇండిపెండెంట్) సర్పంచ్‌గా, ఎనిమిది మంది వార్డుసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మూడు పంచాయతీల్లో మొత్తం పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై ప్రభుత్వ ప్రోత్సాహకం పొందేందుకు ఆయా పంచాయతీలు అర్హత సాధించాయి.

● ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు

తొలి విడతలో చొప్పదండి మండలం పెద్దకురుమపల్లి పంచాయతీల్లో మావురం సుగుణ (ఇండిపెండెంట్), రామడుగు మండలం శ్రీరాములపల్లిలో ఒంటెల సుగుణమ్మ (బీఆర్‌ఎస్), రెండో విడతలో గన్నేరువరం మండలం గోపాల్‌పూర్ గ్రామంలో ఆకుల కవిత (కాంగ్రెస్) ఏకగ్రీ వంగా సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. ఈ నెల 9న మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ చివరి గడువు కావడంతో ఆ రోజు మరికొన్ని వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశ మున్నది.

● పోటాపోటీ ప్రచారం...

పార్టీల ప్రాతిపదికన ఎన్నికలు జరుగకున్నా అన్ని రాజకీయ పార్టీలు తమ మద్దతు దారులను సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా గెలిపించుకోవాలని భావిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో తమ పట్టును నిరూపించుకునేందుకు పంచాయతీ ఎన్నికలను వేదికగా మలుచుకుంటున్నాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రధానంగా పోటీ పడుతుండగా బీజేపీ కూడా గట్టి పోటీ ఇచ్చేం దుకు సిద్ధమవుతున్నది. గ్రామాల్లో వ్యక్తిగత పలుకుబడి ఉన్నవారు, ఆర్థికంగా స్థోమత ఉన్నవారు సర్పంచ్‌లుగా నామినేషన్ వేశారు. ఆయా గ్రామాల్లో తమ పట్టునిలుపుకు నేందుకు వీరు ఎంత డబ్బు అయినా ఖర్చుపెట్టేందుకు సిద్ధపడు తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో, మండల కేంద్రాల్లో ఉన్న పంచాయతీల్లో రాజకీయంగా చైతన్యవంతంగా ఉన్న పంచాయతీల్లో ఈ వాతావరణం ఎక్కువగా (మిగతా 8వ పేజీలో)

● పంచాయతీల్లో పోటాపోటీ

తొలి విడతలో 92 పంచాయతీల్లో 89 సర్పంచ్ పదవులకు 338 మంది, 590 వార్డులకు 1,762 మంది పోటీపడుతున్నారు. ఈ విడతలో ముగ్గురు సర్పంచులు, 276 వార్డుసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

■ రెండో విడతలో 113 పంచాయతీలకు 111 సర్పంచ్ పదవులకు 438, 849 వార్డులకు గాను 2472 మంది పోటీపడుతున్నారు. ఈ విడతలో ఇద్దరు సర్పంచ్‌లు, 197 వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

■ మూడో విడతలో 111 గ్రామ పంచాయతీల్లో ఆరెపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డుసభ్యులు ఎనిమిది మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

110 సర్పంచ్ పదవులకు 687 మంది పోటీ పడుతున్నారు. 1,034 వార్డులకు 113 వార్డులకు సింగిల్ నామినేషన్ వచ్చింది. 921 వార్డులకు 2,696 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈనెల 9 వరకు ఈ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. మరికొన్ని వార్డుల్లో కూడా సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం


గణేశ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, రూరల్ ఏడీఈలు పం జాల శ్రీనివాస్‌గౌడ్, గాదం రఘు ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్, తేజా స్కూల్, ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అతరాయం ఉంటుందన్నారు. రూరల్ ప్రాంతాలో సరస్వతినగర్, వడ్లకాలనీ, చంద్రాపూర్‌కాలనీ, రెవెన్యూకాలనీ, ఆర్టీసీ కాలనీ, హనుమాన్ నగ ర్, అమ్మగుడి, తీగలగుట్టపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన డీపీవో

తిమ్మాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని ఎన్నికల సామగ్రిని జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్లు, ఇతర సామగ్రిని పరిశీలించి ఎంపిడివో రాజీవ్ మల్హోత్రాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న రిటర్నింగ్ అధికారులతో డీపీవో మాట్లాడారు. ఎన్నికల ఏర్పాట్లపై డీపీవో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, ఎంపీవో సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తిమ్మాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న డీపీవో జగదీశ్వర్



మధ్యాహ్నం మాంసాహారం...
రాత్రికి మందు..

● అభ్యర్థులపై సండే ఎఫెక్ట్
● ఎన్నికల వేళ గ్రామాల్లో ఓటర్లకు ఫుల్ దావత్



హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల వేళ ఆయా గ్రామాల్లో అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ విడిచిపెట్టడం లేదు. మద్దతు కూడ గట్టేందుకు డబ్బులను పెద్ద ఎత్తున ఖర్చు పెడుతున్నారు. ఆదివారం రావడంతో ఖర్చు పెద్ద మొత్తంలోనే అవుతోంది. ఇప్పటి దాకా పప్పన్నంతో నెట్టుకు వచ్చిన అభ్యర్థులు ఆదివారం చాలా చోట్ల మాంసాహారం పెట్టారు. మధ్యాహ్నం చికెన్ రైస్, చికెన్ బిర్యానీ ఇచ్చారు. పోటీ గట్టిగా ఉన్న చోట పొట్టేళ్ల తెగాయి. రాత్రికి మందు దావత్‌లు ఇచ్చారు. ఆదివారం రోజంతా దావత్‌లు కొనసాగాయి. యువతకు పెట్టెల కొద్దీ బీర్లు తీసుకెళ్లారు.

● ఉదయం 6 గంటల నుంచే...

పంచాయతీ ఎన్నికలో బరిలో ఉన్న అభ్యర్థులు ఉదయం 6 గంటల నుంచే ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. బరిలో ఉన్న అభ్యర్థి వెంట ఉండే వారికి ప్రత్యేకంగా టిఫిన్ లేదంటే ఇంటి నుంచి ఉప్మాలాంటివి తీసుకెళ్లి తినిపిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం చేయిస్తున్నారు. మళ్లీ రాత్రి 9 గంటలకు వరకు ఓటర్లను రహస్యంగా కలుసుకుంటూ తమకు ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థుల వెంట తిరిగే మహిళలకు 300 నుంచి 400, పురుషులకు 500 రూపాయలు చెల్లిస్తున్నారు.

తగ్గేదేలే..



● గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో రాజకీయాలు
● సర్పంచ్ అభ్యర్థులకు దీటుగా వార్డు మెంబర్ అభ్యర్థుల ప్రచారం

చొప్పదండి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ అభ్యర్థులకు దీటుగా గ్రామాల్లో వార్డు మెంబర్ అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ఒకరికి మించి మరొకరు హామీల వర్షం కురిపిస్తున్నారు. రాత్రిపూట ఓటర్లతో సిట్టింగులు నిర్వహిస్తూ దావత్‌లు ఇస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కుల సంఘాలకు బ్లాంక్ చెక్కులను ఇస్తున్నారు.

● హామీల వర్షం... గెలుపే లక్ష్యం...

మండలంలో 16 గ్రామాల్లో మొత్తం 154 వార్డులకుగాను 53 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 101 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 240 మంది పోటీలో ఉన్నారు. పంచాయతీలో ఓటర్ల సంఖ్యనుబట్టి ప్రతి వార్డుకు వంద నుంచి 300 మంది ఓటర్ల వరకు ఉన్నారు. 150 మంది ఓటర్లు ఉన్న వార్డులో అభ్యర్థి రైతులకు హామీలు ఇస్తున్నారు. గెలిస్తే ఉచితంగా తన హార్వెస్టర్‌తో వరి కోతలు చేయిస్తానని హామీ ఇచ్చాడు. నెల రోజులుగా రైతులకు వరి పొలాలను కోయడానికి ట్రాక్ హార్వెస్టర్ అందుబాటులో లేకపోవడంతో వార్డు మెంబర్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థి ఉచిత హార్వెస్టర్ పథకాన్ని ప్రకటించారు. మరో గ్రామంలో వార్డు సభ్యుడిగా పోటీలో ఉన్న అభ్యర్థి తాను గెలిస్తే కుల సంఘానికి భవాన్ని నిర్మించి ఇస్తానని ఖాళీ చెక్కును అందజేశాడు. మరో గ్రామంలో వార్డు సభ్యుడిగా బరిలో నిలిచిన అభ్యర్థి నామినేషన్ వేసిన మరుసటి రోజు నుంచి ఓటర్లతో సిట్టింగ్ నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజు రాత్రి చికెన్, మద్యంతో ఓటర్లను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. సర్పంచ్ అభ్యర్థితో సంబంధం లేదని, తమను మాత్రం గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. వార్డు పరిధిలోని ఓటర్లు ఎక్కడ ఉన్నారో ఆరా తీస్తున్నారు. సింగరేణిలో ఉద్యోగాలు చేసే వారిని, ముంబయి, భీవండి, కరీంనగర్, హైదరాబాద్‌లో స్థిర పడిన వారిని గుర్తించి ఓటు వేయడానికి గ్రామానికి రావాలని, చార్జీల కోసం డబ్బులు పంపిస్తున్నారు.

ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

● కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, చామనపల్లి, నగునూర్ గ్రామాల్లో కరీంనగర్ రూరల్ పోలీసులు ఆదివారం 'కవాతు' నిర్వహించారు. కూడళ్లలో ప్రజలను సమీకరించి ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి ఏసీపీ, సీఐ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లోని ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ఎన్నికల బందోబస్తుకు వచ్చిన పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ఎన్నికల తర్వాత ప్రజలందరూ కలిసి, మెలిసి ఉండాలని కోరారు. ఎన్నికల నిబంధనలు పాటించక, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలోఎస్‌ఐలు నరేష్, లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వలస ఓటర్ల వైపు అభ్యర్థుల చూపు..

కరీంనగర్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు అభ్యర్థులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిపై దృష్టి సారించారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్నారు. ఎక్కడ ఓట్లు ఎక్కువగా పడతాయి. ఏ ప్రాంతంపై దృష్టి సారించాలి, తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే.. ఒక్క ఓటుతో ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ పరిస్థితి రాకుండా ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో 57 మంది సర్పంచ్‌లు, 132 వార్డులకు గాను 32 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన వార్డుల్లో 247 మంది బరిలో ఉన్నారు. అభ్యర్థులంతా తమ అనుచరులతో కలిసి గెలుపు కోసం కష్టపడుతున్నారు. సాయంత్రం ఒక చోటికి చేరి తమకు అనుకూలంగా ఉన్న ఓటర్ల లెక్క వేసుకుంటున్నారు. ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లకు ఫోన్ చేస్తున్నారు. రాను పోను ఖర్చులు భరిస్తామని హామీ ఇస్తున్నారు. ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉన్న ప్రాంతాలకు వాహనాలు పంపిస్తామని చెబుతున్నారు.

మరో రెండు రోజుల్లో ప్రచారానికి తెరపడనుండడంతో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఓటర్లకు నగదు పంపిణీ ప్రారంభమైనట్లు సమాచారం. మరి కొందరు ఇంటి సామగ్రి అందజేస్తున్నట్లు తెలిసింది.

జోరుగా బుజ్జగింపులు

● ఏకగ్రీవాలు చేసేందుకు గ్రామ పెద్దల చర్చలు



వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 26 గ్రామాల్లో బుజ్జగింపుల పర్వం మొదలైంది. సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవాల కోసం గ్రామాల్లోని పెద్దలు అభ్యర్థులతో చర్చలు జరుపుతున్నారు. మండలంలోని మల్లన్నపల్లి, ఇప్పలపల్లి, బ్రాహ్మణపల్లి, దేశాయిపల్లి గ్రామాల్లో సర్పంచ్ స్థానాన్ని ఏకగ్రీవం చేసేందుకు తీవ్రంగా చర్చిస్తున్నారు. మల్లన్నపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి మూడు గుంటల భూమి ఇచ్చేందుకు ఓ అభ్యర్థి ముందుకు వచ్చాడు. వార్డు సభ్యుల ఏకగ్రీవాల కోసం జోరుగా బుజ్జగింపులు చేస్తున్నారు. ఇప్పటికే 14 వార్డులకు ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవం కానున్నాయి. మండలంలోని 246 వార్డులకు రికార్డు స్థాయిలో 698 మంది నామినేషన్ దాఖలు చేశారు. 26 గ్రామల సర్పంచులకు గాను 157 మంది సర్పంచ్ పోటీలో ఉన్నారు.

పోటాపోటీగా ఖర్చులు



గంగాధర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలకు అభ్యర్థులు పోటాపోటీగా ఖర్చు చేస్తున్నారు. ఆదాయ వనరులున్న గట్టుభూత్కూర్, ఒద్యారం, ఆచంపల్లి, సర్వారెడ్డిపల్లి, మధురానగర్, గంగాధర, బూరుగుపల్లివంటి గ్రామాల్లో అభ్యర్థులు ఎలాగైనా గెలవానే పట్టుదలతో ఖర్చుకు వెనకాడడంలేదు. గట్టుభూత్కూర్, ఆచంపల్లి, ఒద్యారం వంటి గ్రామాల్లో గ్రానైట్ క్వారీలు, గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇక్కడ బరిలో నిలిచిన అభ్యర్థులు సర్పంచ్ పదవిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని లక్షలు ఖర్చు చేయడానికి ముందుకు వస్తున్నారు. మధురానగర్, గర్షకుర్తి, బూరుగుపల్లి గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుంది. ఈ గ్రామాల్లో 30 లక్షల నుంచి 40 లక్షల వరకు ఖర్చు చేసేందుకు సర్పంచ్ అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. గంగాధర వారసంత జిల్లాలోనే ఆవులు, గొర్రె, మేకలకు ప్రసిద్ధి. ఇక్కడ సంవత్సరానికి వారసంతద్వారా గ్రామపంచాయతీకి 1.5 కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. ఇక్కడ వార్డు సభ్యులు పదవులకూ పోటీ ఎక్కువగానే ఉంది. ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో మూడు లక్షల వరకు ఖర్చు పెడుతున్నారు. వార్డు సభ్యులుగా గెలిస్తే ఉప సర్పంచ్ పదవి రేసులో ఉండవచ్చని భావిస్తున్నారు.

● పదవి కోసం తప్పని తిప్పలు

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో ఏలాగైనా పదవి దక్కించుకోవాలని అభ్యర్థులు తిప్పలు పడుతున్నారు. ప్రచారంలో ఖర్చు పెట్టడానికి వ్యవసాయ భూములు, ప్లాట్లను కుదువపెట్టి అప్పులు చేస్తూ బరిలో నిలుస్తున్నారు.

మరో వైపు ప్రచారంలో ప్రత్యర్థికి ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ఆర్భాటాలకు పోతున్నారు. ఆదాయం అంతగా లేని చిన్న చిన్న గ్రామాల్లో అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నారు. పెద్ద గ్రామపంచాయతీలో అభ్యర్థులు చేస్తున్న ఖర్చును చూసి చిన్న గ్రామాల్లోని ప్రజలు అదేస్థాయిలో ఆశిస్తున్నారు. దీంతో చిన్న గ్రామ పంచాయతీల్లో బరిలో నిలిచిన అభ్యర్థులకు ఖర్చు తలకు మించిన భారంగా మారింది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



సత్తయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో ఈనెల 3న రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు నమిలికొండ సత్తయ్య(65) ఆదివారం మృతిచెందాడని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని సత్తయ్య ఈనెల4న రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కిష్టునాయక్ తండాకుచెందిన యువకుడు గుగులోతు విజయ్ బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయలపాలైన వృద్ధుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య చంద్రవ్వ, కొడుకులు బాబు, నర్సింలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

వివాహిత ఆత్మహత్య



రచన(ఫైల్)

కోరుట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతాలనికి చెందిన అడెపు రచన అలియాస్ జోగల హరి (27) అనే వివాహిత ఆదివారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అడెపు రచనకు మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన జోగ రాజేష్‌తో వివాహం జరిగినట్లు తెలిపారు. దంపతులకు కూతురు జన్మించిన తరువాత అత్తిం టి వారి వరకట్నం వేధింపులతో రచన కోరుట్ల పట్టణంలోని తల్లిగారి ఇంట్లో ఉంటుంది. ఈక్రమంలో రచన మల్లాపూర్ మండలంలోని పోలీస్ స్టేషన్‌లో అత్తింటి వారిపై ఫిర్యాదు చేసింది. ఆదివారం ఉదయం ఇంట్లో నుంచివెళ్లిన రచన అదేప్రాంతంలోని వ్యవసాయబావిలోదూకి ఆత్మహత్య చేసుకున్నాట్లు వారు తెలిపారు. రచన తండ్రి అడెపు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుతపులి దాడిలో ఆవు మృతి

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో చిరుతపుడి దాడిలో ఆవు మృతిచెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లాండే సంతోష్ అనేరైతు రోజు మాదిరిగానే పొలం వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం రైతు పొలం వద్దకు వెళ్లి చూడగా ఆవు కనబడలేదు. చుట్టుపక్కల వెతకగా ఆవు కళేబరంతోపాటు చిరుతపులి అడుగులను గుర్తించాడు. చిరుతపులి పొలం వద్దకు ఆవును ఎత్తుకెళ్లి చంపినట్లు తెలిపారు. ఆవు విలువ దాదాపు రూ.70వేలు ఉంటుందని, బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయమై అటవీశాఖ డిప్యూటీ రెంజ్ ఆఫీసర్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ లింగంపేట గ్రామంలోని కొత్తకుంట శివారులో ఆవుపై చిరుతపులి దాడి చేసింది వాస్తవమేనని అన్నారు. పశువైద్యాధికారులతో ఆవు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందజేస్తామన్నారు.

ముక్కిన బియ్యం తిని గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

మల్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రామన్నపేటకు చెందిన దండిక మల్లేశం, తాడుక గంగన్నకు చెందిన 150 గొర్రెలు ముక్కిన బియ్యం తిని మృత్యువాత పడ్డాయి. శుక్రవారం నూకపల్లి సమీపంలో వ్యవసాయ పొలంలో పడేసిన ముక్కిన బియ్యం తినగా శనివారం, ఆదివారం మృతి చెందినట్లు బాధిత యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా పశువైద్యాధికారులు, రెవెన్యూ అధికారులు మృతి చెందిన జీవాలను పరిశీలించి నష్టం అంచనా వేశారు. నష్టపోయిన యజమానులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్ శివారులో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని వెల్దికి చెందిన పెంచాల సిద్ధార్థరావు, మడ్డి రాకేష్ ఆదివారం తెల్లవారు జామున కరీంనగర్ నుంచి గ్రామానికి కారులో వెళ్తున్నారు. లింగాపూర్ శివారులో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి అదుపు తప్పి పక్కన ఉన్న చెటును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

సెల్‌ఫోన్‌కు రక్షణ.. సంచార్ సాథి

SANCHAR SAATHI MOBILE APP



- అనధికార సిమ్‌లు, నకిలీ కనెక్షన్లకు చెక్
- టెలికాం మోసాలకు అడ్డుకట్ట

చొప్పదండి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పల్లెలు, పట్టణాల్లో ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉండడం మాములైపోయింది. ప్రతి నిత్యం సెల్‌ఫోన్‌లో అనధికార యాప్‌లతో సైబర్ మోసాలకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంచార్ సాథి యాప్ నకిలీలకు చెక్ పెడుతూ టెలికాం మోసాలకు అడ్డుకట్ట వేస్తోంది. ఒక పేరుపై ఎన్ని సిమ్‌లు ఉన్నాయో యాప్ ద్వారా తెలుసుకోవడమే కాకుండా మొబైల్ ఫోన్ పోయినా, దొంగలు ఎత్తుకుపోయినా బ్లాక్ చేస్తుంది ఈ యాప్.

● యాప్‌తో ప్రయోజనాలు

సంచార్ సాథి యాప్ ద్వారా ఒక వ్యక్తి తన పేరుపై ఉన్న సిమ్ కనెక్షన్ల వివరాలు తెలుసుకోవచ్చు. ఒక పేరుమీద ఆధార్ కార్డుతో ఎన్ని సిమ్‌లు రిజిస్టర్ అయ్యాయో తెలుస్తుంది. మొబైల్ ఫోన్ కంపెనీ వివరాలు అసలు, నకిలీ వివరాలు తెలుస్తాయి. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోయినా, దొంగలు ఎత్తుకుపోయినా బ్లాక్ చేసుకోవచ్చు. మొబైల్‌ను బ్లాక్ చేస్తే దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. అనుమానాస్పద కాల్స్ ఎస్ఎంఎస్‌లను యాప్‌లో రిపోర్టు చేయవచ్చు. మొబైల్‌కు భద్రత కల్పించే విధంగా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను అన్ని ప్రాంతీయ భాషల్లో ఉపయోగించవచ్చు. పోయిన ఫోన్ స్టేటస్‌ను తెలుసుకునే అవకాశం ఈ యాప్‌లో ఉంది.

- మీ పేరు మీద ఉన్న సిమ్‌లను చెక్ చేసుకోవచ్చు. దేశంలో ఎక్కడైన మీ పేరు మీద ఉన్న సిమ్‌లు ఉన్నట్లయితే వాటి వివరాలు తెలుస్తాయి.
- పై మొబైల్ కనెక్షన్ మీద క్లిక్ చేయగానే మీ ఆధార్‌పై ఇతరులు తీసుకున్న సిమ్‌లు కనిపిస్తాయి. మీ పేరుమీద ఇతరులు సిమ్ తీసుకున్నట్లయితే రిపోర్టు, డిస్ కనెక్షన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే సిమ్‌పై వాడే నంబర్‌ను రద్దు చేయవచ్చు.
- ఫోన్ పోయినా, ఎవరైనా ఎత్తుకుపోయిన బ్లాక్, స్టోలెన్/లాస్ట్ డివైస్‌ను ఓపెన్ చేసి ఐఎంఈఐ నంబర్ నమోదు చేసి ఎఫ్ఐఆర్ నంబర్‌ను అప్‌లోడ్ చేయాలి. 24 గంటల్లోపు పోయిన ఫోన్ నెట్‌వర్క్ బ్లాక్ అవుతుంది. ఫోన్ వాడకుండా, దుర్వినియోగం కాకుండా ఉంటుంది. ఫోన్ దొరికిన తర్వాత అన్‌బ్లాక్ డివైస్ ఆప్షన్‌ను ఎంటర్ చేస్తే తిరిగి పనిచేస్తుంది.

● యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా...

గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో సంచార్ సాథి అని సెర్చ్ చేయాలి. డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయగాను ఓటీపీ వస్తుంది. ఓటీపీని వెరిఫై చేసిన తర్వాత డాష్‌బోర్డులో కొన్ని ఫీచర్స్ కనిపిస్తాయి. మొబైల్ కనెక్షన్స్, రిపోర్ట్ ఫ్రాడ్ కాల్స్, ఎస్ఎంఎస్, బ్లాక్ డివైస్, చెక్ లాస్ట్, ఫోన్ స్టేటస్, ట్రేస్ ఐఎంఈవో వంటి ఫీచర్లు ఉంటాయి.

రేషన్ బియ్యం పట్టివేత



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఓఎస్‌డీ ప్రభాకర్

హుజూరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఓ రైస్ మిల్లులో ఆదివారం భారీఎత్తున రేషన్ బియ్యం పట్టుకున్నారు. హుజూరాబాద్‌లో రేషన్ బియ్యం అక్రమరవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు సివిల్‌సప్లయీస్ ఎన్ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా ఏర్పాటుచేశారు. పట్టణంలోని బోర్నపల్లి శివారులోని ఓ రైస్‌మిల్లుకు ఆటోల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా అధికారులు దాడులు నిర్వహించారు. ఒక్కో ఆటోలో మూడు క్వింటాళ్ల చొప్పున ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ రైస్‌మిల్లులో తనిఖీచేయగా సుమారు 320 క్వింటాళ్ల పీడీఎస్ లూస్‌రైస్‌ను గుర్తించారు. ఈసందర్భంగా సివిల్ సప్లయీస్ ఎన్ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ మాట్లాడుతూ చిగురుమామిడి మండలంలోని పలుగ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ 12రూపాయలచొప్పున రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి ఎడ్ల రమేష్ అనే దళారికి విక్రయిస్తున్నారన్నారు. రమేష్ చెప్పడంతోనే రేషన్‌బియ్యాన్ని మిల్లుకు తరలిస్తున్నట్లు ఆటోయజమానులు పేర్కొన్నారన్నారు. బియ్యాన్ని రేషన్ స్టాక్‌పాయింట్‌కు తరలించామని, రైస్‌మిల్లు యజమాని, దళారులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. దాడుల్లో అధికారులు లక్ష్మారెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

'నవోదయ'లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చొప్పదండి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామన్నారు. అనంతరం పూర్వవిద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా కేవీఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మధుకృష్ణ, ట్రెజరర్‌గాశ్రీనివాస్‌ను ప్రకటించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శంకరపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. వీణవంకమండలం జంగంపల్లి(కోర్కల్) గ్రామానికి చెందినరావణావేణిసాగర్ ఇసుకరవాణా చేస్తున్నట్లు, అతడిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జమ్మికుంట రూరల్ : జమ్మికుంటలోని మడిపల్లి రైల్వేగేటు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీస్‌లు పట్టుకున్నారు. వీణవంక మండలానికి చెందిన నవీన్, రవిని అదుపులోకి తీసుకొని, ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

తిమ్మాపూర్ : మండలంలోని రేణికుంట వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు, డ్రైవర్ పప్పుకృష్ణపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాచర్లగొల్లపల్లిలో చోరీ



బీరువాను ధ్వంసం చేయడంతో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో భానుచందర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. లోనికి చొరబడిన దొంగలు బీరువాను ధ్వంసం చేసి వస్తువులను చిందరవందరగా పడేశారు. రూ.10 వేల నగదు, విలువైన పత్రాలతో పాటు రూ.80 వేల విలువైన 2 ట్యాబ్‌లు, 3సెల్‌ఫోన్లను అపహరించుకుపోయారు. భానుచందర్ ఇంటికి తాళం వేసి రెండు రోజుల కిందట తన కుటుంబ సభ్యులతో కలిసి సిరిసిల్ల వెళ్లాడు. ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి తాళం తీసి కనిపించింది. ఇంటిలోని బీరువాను ధ్వంసం చేయడంతో పాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, వేలిముద్రల నిపుణులు చేరుకుని నమూనాలను సేకరించారు. వేసిన తాళం పగులకొట్టకుండా తీసి చోరీ చేయడం పట్ల పోలీసులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో ఆదివారం ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్‌చేసి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లె గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలంలో నుంచి టిప్పర్‌లో మొరం నింపుకొని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పెద్దూరు బస్టాండు వద్ద పట్టుకొని సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. నిందితులు ఎల్లారెడ్డిపేట మండలం కిషన్‌దాస్‌పేట గ్రామానికి చెందిన బోల్లి ప్రవీణ్, సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెందిన మామిండ్ల జగన్‌లపై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

రుద్రంగి చెక్‌పోస్టు వద్ద మద్యం పట్టివేత



ఇల్లందకుంటలో పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్



రుద్రంగి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న మద్యం బాటిళ్లు

రుద్రంగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రం శివారులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. రుద్రంగి నుంచి దెగావత్ తండా గ్రామానికిచెందిన ఓవ్యక్తి బైక్‌పై రూ.4వేల విలువగల మద్యం తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద అధికారులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వంశీ, హెడ్‌కానిస్టేబుల్ పద్మరావు తదితరులు ఉన్నారు.

మద్యం అక్రమంగా అమ్మితే కఠిన చర్యలు

ఇల్లందకుంట : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా మద్యం అమ్మినా, నిల్వ ఉంచినా కేసులు తప్పవని ఎస్ఐ క్రాంతి కుమార్ అన్నారు. ఆదివారం నడికూడ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికిచెందిన చిప్ప మనోజ్ రూ.11080విలువగల మద్యాన్ని ఇల్లందకుంట మండలం నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన మద్యాన్ని సీజ్‌చేసి, మనోజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా పట్టివేత

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండా, రాచర్లగొల్లపల్లి గ్రామా ల్లో 2లీటర్ల సారా, రూ.2838 విలువైన మద్యం స్వాధీనపర్చుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సారా తయారుచేస్తున్న రజిత, మద్యంవిక్రయిస్తున్న షేక్‌మౌలానాపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లఘించి సారా, మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

శభాష్ పోలీస్..

- సామాజిక సేవలో పోలీసులు
- రోడ్డు పై ప్రమాదకరంగా ఉన్న గుంతలు పూడ్చివేత



రోడ్లపై గుంతలు పూడ్చుతున్న పెద్దపల్లి రూరల్ పోలీసులు(ఫైల్)

మంథని, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రహదారులపై గుంతలను పూడ్చుతూ మంథని పోలీసులు ప్రజలచే శభాష్ అనిపించుకుంటున్నారు... ఇటీవల వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై పోలీసులు దృష్టిసారించారు. పలుచోట్ల బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. రోడుపై గుంతలతో వాహనాలు అదుపు తప్పి కిందపడి మరణాలు, గాయాల పాలవుతున్నారు. ఒక వైపు స్థానిక సంస్థల ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడానికి పోలీసులు నిమగ్నమవుతూనే.. మరోవైపు సామాజిక బాధ్యతగా సేవలందిస్తున్నారు. దాదాపు 10ఏళ్లక్రితం నిర్మించిన మంథని-గోదావరిఖని 26 కిలోమీటర్ల ప్రధాన రహదారిపై నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తారు. పలు ప్రాంతాల్లో రోడ్డు మధ్య భాగాల్లో, ఇరువైపులా పక్కన గుంతలు పడ్డాయి. రోడ్డు పై లోతుగా, వెడల్పుగా పడిన గుంతల కారణంగా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వచ్చి వీటిలో పడి ద్విచక్రవాహనదారులు కిందపడి గాయపడిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఎన్నికల డ్యూటీలో భాగంగా మంథని ప్రాంతానికి వస్తున్న క్రమంలో గుంతలు గమనించి వీటి పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని మంథని ఎస్ఐ దేగ రమేష్‌ను ఆదేశించారు. దీంతో సిబ్బందితో ఆటో ట్రాలీలో మట్టి, కంకర నింపుకొని వెళ్ళి మంథని -గోదావరిఖని ప్రధాన రహదారిపై పలు చోట్ల ఉన్న గుంతలను పూడ్చి వేయించారు. ప్రమాదాల నివారణ కోసం సామాజిక బాధ్యతగా గుంతలు పూడ్చిన మంథని పోలీసులను ఏసీపీ రమేష్ అభినందించారు.

పెద్దపల్లి - ధర్మారం వెళ్లే రహదారిలో..

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి-ధర్మారం వెళ్లే రహదారిలో అడుగుకో గుంత ఉండటంతో పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో పోలీస్‌ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దపల్లిరూరల్ ఎస్ఐ మల్లేష్ ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతలు లేకుండా పూడ్చివేశారు. గత నెల16న కాసులపల్లి శివారులో ధర్మారం మండలం బొట్ల వనపర్తి గ్రామానికి చెందిన కత్తెర్ల లక్ష్మణ్ కుటుంబసభ్యులతో ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా రాత్రి వేళల్లో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి వాహనం అదుపు తప్పడంతో సాయిపావని (13) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమదాలను నివారించేందుకు గాను పెద్దపల్లి పోలీస్ అధికారులు ముందుకొచ్చారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దపల్లి - ధర్మారం వెళ్లే ప్రధాన రహదారిలో ఎస్ఐ సిబ్బందితో గుంతలను గుర్తించి పూడ్చి వేయించారు.

● అతి వేగం ప్రమాదకరం

- మల్లేష్, పెద్దపల్లి రూరల్ ఎస్ఐ



వాహనదారులు వాహనాలను అతి వేగంగా నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతాయి. ద్విచక్ర వాహన దారులు మద్యం సేవించి వాహనం నడుప రాదని, హెల్మెట్ ధరించాలి. లారీలు, ట్రాక్టర్‌లు ఓవర్ లోడ్‌తో వెళ్లడం ద్వారా రోడ్లు గుంతలుగా మారుతున్నాయి. ప్రతి ఒక్కరూ గమనించి ప్రమాదాల నివారణకు సహకరించాలి.

దాడి ఘటనలో భార్యాభర్తలపై కేసు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని భార్యాభర్తలు సుంకరి ప్రమీల, రాజమల్లుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. గ్రామంలోని సుంకరిమల్లయ్య పేరిటఉన్న 1.13ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నాడని చెప్పారు. ఆ భూమిలో తనకు వాటా ఉందని పేర్కొంటూ అతని సోదరుడు రాజమల్లు, మరదలు ప్రమీలలు ఈనెల6న మల్లయ్య ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి దాడికి దిగారని తెలిపారు. బాధితుడి మల్లయ్య భార్య అమృతవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ వివరించారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని మహిళ తోకల లక్ష్మణ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని తోకల నవీన్ 2017లో లక్ష్మణను ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కొడుకు, కూతురు ఉన్నారు. లక్ష్మణ ఇంటి వద్ద బీడీలు చుడుతూ జీవిస్తోంది. ఆదివారం ఉదయం ఆమె ఇంటిలో చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి చేరుకోకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఆరాతీశారు. ఆచూకీ లభించకపోవడం వల్ల నవీన్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

కుంగిపోతున్న పండుటాకులు

- పిల్లల ఆదరణ కరువు
- చివరి దశలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వృద్ధులు



వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అందరూ ఉన్నా కొందరు వృద్ధులు అనాథలుగా మిగులుతున్నారు. కన్నబిడ్డలను కంటికి రెప్పల కాపాడి ప్రయోజకులను చేస్తే రెక్కలు వచ్చిన తర్వాత తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరు ఆస్తుల కోసం వేధింపులకు పాల్పడుతున్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కంటికి రెప్పాల చూసుకోవాల్సిన కొందరు పట్టించుకోవడం లేదు. ఆస్తుల కోసం వేధింపులకు గురిచేయడం, తిండి పెట్టకపోవడం, చేయి చేసుకోవడం చివరకు చంపేందుకు వెనకాడకపోవడం వంటి ఘటనలు కుంగిపోయేలా చేస్తున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకొని పిల్లలను పెంచి ప్రయోజికులను చేస్తే వృద్ధాప్యంలో పట్టెడన్నం పెట్టాకుండా మనోవేదనకు గురి చేయడాన్ని తట్టుకోలేకపోతున్నారు. కొంతమంది ఇంటినుంచి వెళ్లిపోతున్నారు. మరి కొంత మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో మండలంలో తరచూ వృద్ధుల బలవన్మరణాలు పెరిగిపోతున్నాయి. మండలంలోని నర్సింగాపూర్‌లో వృద్ధ దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. మండలంలో ఏడాదిగా పలు గ్రామాల్లో వృద్ధుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి.

చట్టాలున్నా అవగాహన లేక ఇబ్బందులు..

పండుటాకులకు సొంతబిడ్డల నుంచే వేధింపులు, నిరాదరణ ఎదురవుతుండడంతో కేంద్రం2007లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల రక్షణ పోషణ చట్టం తీసుకొచ్చింది. రెవెన్యూ డివిజన్‌స్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. వృద్ధులు తమ పేరిట ఉన్న ఆస్తులను పూర్తిగా పిల్లలకు రాసి ఇచ్చాకపట్టించుకోక పోవడంతోపాటు వారిని ఇబ్బంది పెడుతు న్నారు.

అల్ట్రా మారథాన్ ఈవెంట్‌లో పాల్గొన్న సిరిసిల్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్



ఈవెంట్‌లో పాల్గొన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ అనిల్‌యాదవ్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్- జైసల్మేర్ నుంచి లాంగెవాలా వరకు నిర్వహించిన ది బోర్డర్-2025 వంద కిలో మీటర్ల అల్ట్రా మారథాన్ రన్‌లో సిరిసిల్లజిల్లాకు చెందిన ఆర్మ్‌డ్ రిజర్వ్ కాని స్టేబుల్ అనిల్ యాదవ్ పాల్గొన్నారు. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎడారి ప్రాంతంలోని వేడి, చలి తీవ్రత, ఎత్తైన ఇసుక మేటల వంటి సవాళ్ల మధ్య వంద కిలోమీటర్ల పొడవునా సాగిన ఈ రన్‌ను కాని స్టేబుల్ అనిల్ యాదవ్ 14గంటల్లో పూర్తిచేశారు. ఇటువంటి అల్ట్రా మార థాన్ ఈవెంట్‌లో పాల్గొని ఫోర్స్‌లోని యువసిబ్బందికి ఆదర్శంగా నిలిచిన అనిల్ యాదవ్‌ను ఆదివారం ఎస్పీ మహేష్ బీ గీతే అభినందించారు.

భీమన్న సన్నిధిలో నటి ఐశ్వర్య రాజేశ్ పూజలు


భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 'సంక్రాంతికి వస్తున్నాం' హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

ఇంటి నుంచి ఓటు లేనట్లే..

- అసెంబ్లీ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- పంచాయతీ ఎన్నికల్లో స్పష్టత కరువు


ఇంట్లో ఓటు వేస్తున్న వృద్ధురాలు (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):రెండేళ్ల క్రితం నిర్వహించిన శాసన సభ, లోక్ సభ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. నడవలేని, చేతగాని, మంచానికే పరిమితమైన వృద్ధులు పోలింగ్ కేంద్రానికి వెళ్లలేక పోవడంతో వారు తమ ఓటు హక్కును వినియో గించుకోలేకపోతున్నారు. ఫలితంగా ఓటింగ్ శాతం తగ్గుతోంది. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం అటువంటి వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించింది. కానీ ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో మాత్రం అలాంటి అవకాశం ఇవ్వలేదు. సర్పంచ్, వార్డు సభ్యులకు ఓటు వేసేందుకు దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం కోసం ఎదురుచూ స్తున్నా ఎన్నికల సంఘం నుంచిఅలాంటి ప్రకటన రాలేదు.

గత ఎన్నికల్లో ఇలా

గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు జాబితాలో పేరుండి 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు, 45 శాతానికి పైగా వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకు ప్రత్యేకంగా 12-డీ ఫారాన్ని ముందస్తుగానే నింపి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. వారు ఇచ్చిన అడ్రస్‌కు పూర్తి స్థాయి భద్రత, పోలింగ్ సామగ్రితో వెళ్లి అధికారులు ఓటు వేయించారు.

ఇబ్బందులు పడే అవకాశం

ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికలో ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు కచ్చితంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. పోలింగ్ సమయం కూడా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే ఉంటుంది. నిర్ణీత సమయం లోపు కుటుంబ సభ్యులు వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించాలి. కాదూ అని వారిని వదిలేస్తే ఓటింగ్ శాతం తగ్గి గెలుపు, ఓటములపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతోపాటు ఓటర్లు సైతం ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

వృద్ధులకు అవకాశం కల్పించాలి..


- కరిమిండ్ల దేవయ్య, కనుకులగిద్దె.

నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఇంటి వద్ద నుంచే ఓటు వేసేలా అధికారులు అవకాశం కల్పించాలి. వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అలాంటి వారిని అధికారులు గుర్తించి అవకాశం కల్పించాలి.

లైన్‌లో నిల్చోలేం..


-దార రాధమ్మ, జూపాక

పంచాయతీ ఎన్నికల్లో ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లి గంటల తరబడి అక్కడ నిలబడలేం. అంత దూరం నడుచుకుంటూ వెళ్లాలన్నా ఇబ్బందే. అధికారులు స్పందించి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించాలి.

భీమన్న సన్నిధిలో అభివృద్ధి పనులు పరిశీలన

- అధికారులకు పలు సూచనలు చేసిన విప్ ఆది శ్రీనివాస్


ఆలయంలో భక్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీభీమేశ్వరస్వామిని ప్రభుత్వవిప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి భక్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కోడె క్యూలైన్లు, సిసి రోడ్డు, క్యూలైన్ ఫ్లైఓవర్, ఉచిత దర్శనం క్యూలైన్, ప్రత్యేక దర్శనం క్యూ లైన్, వీఐపీ రోడ్డు, పార్వతీపురం ధర్మశాల రోడ్డు, లడ్డు కౌంటర్, అలాగే కొత్తగా ఏర్పాటు చేస్తున్న షాపులు పలు ప్రదేశాలను పరిశీలించారు.

రైల్వే గేట్ వద్ద రహదారిపై గుంతలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


పూడూర్ రైల్వే గేట్ దగ్గర రహదారిపై ఏర్పడిన గుంత

కొడిమ్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్ రైల్వేగేట్‌కు సమీపంలో రోడ్డుపై ఇరువైపులా గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పూడూర్ గ్రామం కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్నది. కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, జగిత్యాల జిల్లాలోని మేడిపెల్లి, కథలాపూర్, కోరుట్లకు చెందిన వారు కరీంనగర్‌కు వెళ్లాలంటే మండలకేంద్రంనుంచి అప్పారావుపేట, పూడూర్ గ్రామాల మధ్యఉన్న పూడూర్ రైల్వే గేట్‌పైనుంచి రాకపోకలు సాగిస్తుంటారు. జగిత్యాల నుంచి వేములవాడకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రైల్వేగేట్‌కు ఇరువైపులా ఏర్పడిన గుంతలను సంబంధిత అధికారులు పూడ్చి వేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్టోరీస్ ఫ్రమ్ ఇండియా-6 ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కవులు సబ్బని లక్ష్మీనారాయణ, సంకెపెల్లి నాగేంద్రశర్మ ఆంగ్లంలో రచించిన కథల సంకలనం స్టోరీస్ ఫ్రమ్ ఇండియా-6 పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం హైదరాబాద్ బిర్లా సైన్స్‌సెంటర్ భాస్కర ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ కథా సంకలనాన్ని యుకియోటో అంతర్జాతీయ ప్రచురణల సంస్థ ప్రచురించింది. ఇందులో అఖిల భారత స్థాయిలో వివిధ రాష్ట్రాలకు చెందిన 18మంది కవుల, రచయితల కథలు, కవితలు కూడా ఉన్నాయి. ఈసందర్భంగా కరీంనగర్ అరబిందో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కోల అన్నారెడ్డి, ఉప్పల రామేశం, సాయినగర్ వెల్ఫేర్‌సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ రాజు, ఎస్ సురేందర్‌రెడ్డి, పీవీ సాహిత్య పీఠం అధ్యక్షుడు కేవీ సంతోష్ బాబు, పీఆర్టీయూ తెలంగాణ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ఉపాధ్యాయులు చిందం రమేశ్, వెల్మల జయపాల్‌రెడ్డి, బొమ్మ కల్ రైతుసంఘం నాయకుడు కె నారాయణ రెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.

పైపులైన్ లీకేజీకి.. మరమ్మతు చేయరూ..


జగ్గయ్యపల్లిలో రోడ్డు పక్కన లీకవుతున్న పైప్‌లైన్

మానకొండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో తాగునీటి పైపులైన్ లీకేజీతో నీరు వృథా అవుతోంది. మానకొండూర్-వేగురుపల్లి ప్రధాన రహదారి జగ్గయ్యపల్లిలోని రోడ్డు పక్కన తాగునీటి పైపులైన్ లీకేజీ సమస్య ఏర్పడింది. దీంతో నీరు కలుషితమవుతోందని, వృథాగా పోతోందని గ్రామస్థులు వాపోతున్నారు. మరో వైపు పైపులైన్ మరమ్మతు కోసం గుంతను తవ్వి వదిలేశారు. గుంత రోడ్డు పక్కనే ఉండడంతో రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సు వచ్చే సమయంలో ద్విచక్ర వాహనం రోడ్డు పక్కకు దిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, పైపులైన్‌కు మరమ్మతు చేపట్టాలని, గుంతను పూడ్చివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కరీంనగర్ చిత్రకారుడికి అభినందనలు


మహానటి సావిత్రి కూతురు విజయ ఛాముండేశ్వరికి సావిత్రి చిత్రాన్ని అందజేస్తున్న రాపర్తి వెంకటేశం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన నంది అవార్డు గ్రహీత, ఉపాధ్యాయుడు, రంగస్థల కళాకారుడు, గాయకుడు రాపర్తి వెంకటేశంను మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మహానటి సావిత్రి కుమార్తె విజయ ఛాముండేశ్వరి అభినందించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం రాత్రి సావిత్రి 90వ జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడికి, విజయఛాముండేశ్వరికి వెంకటేశం తన స్వహస్తాలతో గీసిన వారి చిత్రపటాలను బహూకరించారు. కరీంనగర్ కళాకారుడికి ఓ గొప్ప కళావేదికపై అరుదైన గౌరవం దక్కిందని రాష్ట్ర విశ్రాంతప్రభుత్వ ఉద్యోగుల సంఘం, కరీంనగర్ యూనిట్ సభ్యులు, పలువురు కళాకారులు అభినందనలు తెలిపారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర


గొల్లపల్లిలో ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


మెట్లచిట్టాపూర్‌లో బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జునస్వామి జాతర ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పోటెత్తింది. భక్తులు బెల్లంపానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకొని ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ, శివసత్తుల పూనకాల మధ్య ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లో గర్భగుడిలోకివెళ్లి స్వామివారిని దర్శించుకొని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు ఒగ్గుపూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలువేసి ప్రత్యేకమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల మల్లన్ననామస్మరణలతో ఆలయ పరిసర ప్రదేశాలు ప్రతిధ్వనించాయి. ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్‌శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారీసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ.1,75,400ఆదాయం సమకూరినట్లు ఆలయఫౌండర్‌ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్‌లో భక్తులకు అసౌకర్యం కల్గకుండా ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు ఉచిత సేవలను అందించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు రాంనర్సింహారెడ్డి, శ్రీనివాస్, ఎస్సైలు కృష్ణాసాగర్‌రెడ్డి, జగిత్యాల టౌన్‌ఎస్సై రవికిరణ్, సీసీఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. జాతర ఉత్సవాలను ఏఎంసీచైర్మన్ భీమసంతోష్, ఆలయఈవో విక్రమ్, ఆలయఫౌండర్‌ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు.

బోనాలు సమర్పించిన భక్తులు

మెట్లచిట్టాపూర్‌లో ఘనంగా బోనాలు..

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో శ్రీమల్లికార్జున బోనాలపండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. ఈసందర్భంగా మాజీసర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డితోపాటు గ్రామాభివృద్ధికమిటీ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామంలోని ప్రజలు ఇంటికి ఒకబోనంను భక్తిశ్రద్ధలతోచేసి నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి బయలు దేరారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బోనంతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి నాయకులు కుంట జనార్దన్, మింగస్వామి, పెంట హిమాకర్, తేలు శేఖర్, దువ్వాక మురళి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ..

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదిలో ఆదివారం మల్లన్న భక్తులరద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని గోదావరినదికిభారీగా భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులు పవిత్ర గోదావరినదిలో స్నానాలు చేశారు. నదీజలాలతో మల్లికార్జున విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇసుక లింగాల వద్ద ఉంచి పూజించారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు చాంపియన్‌షిప్


చాంపియన్‌షిప్ సాధించిన ఉమ్మడిజిల్లా బాలబాలికల జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 సెపక్‌తక్రా పోటీల్లో ఉమ్మడిజిల్లా బాలురజట్టు చాంపియన్‌షిప్ గెలుచుకుంది. బాలికల జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. మహబూబాబాద్ జిల్లా కురవిలో ఈనెల 4నుంచి 6వరకు 69వ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడికరీంనగర్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. అండర్-14 బాలికలజట్టు తృతీయస్థానం సాధించింది. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్‌లో ఈనెల 16నుంచి 19వ తేదీవరకు జరిగే అండర్-17 జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడిజిల్లా సెపక్‌తక్రా ప్రధాన కార్యదర్శి గసు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులను జిల్లాయువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, సెపక్‌తక్రా కోచ్‌లు కుమార్, శ్రీనివాస్, సుమాన్, శ్రీకాంత్ అభినందించారు.

కేంద్ర నిధులతో ఏకగ్రీవ గ్రామాల అభివృద్ధి

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్


పీచుపల్లి సర్పంచును సన్మానిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రనిధులతో ఏకగ్రీవ గ్రామా లను అభివృద్ధి చేస్తామని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నికైన పీచుపల్లి, విజయ్‌నగర్‌కాలనీ సర్పంచులు సామ రాజిరెడ్డి, అమూల్య రాజశేఖర్‌రెడ్డిని సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలకు పదిలక్షల ప్రోత్సాహక నిధులు ఇస్తానన్నారు. కోహెడ సర్పంచ్‌గా ఎన్నికైన అమూల్య రాజశేఖర్ తనవంతుగా గ్రామ అభి వృద్ధికి రూ.9లక్షలు ఇస్తామనడం అభినందనీయమన్నారు. త్వరలోనే ఏకగ్రీవ మైన గ్రామాల్లో పర్యటించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వేములవాడకు పోటెత్తిన భక్తులు


భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో భక్తులుపోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు భీమేశ్వరఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ, కల్యాణం తదితర ఆర్జితసేవల్లో పాల్గొన్నారు. కోడెమొక్కును చెల్లించుకున్నారు. రాజరాజేశ్వర స్వామివారిని ఎల్‌ఈడీస్ర్కీన్‌లో దర్శించుకున్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ..

వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతోరద్దీగా మారింది. భీమేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు


గణపతి ఆలయంలో స్వామి వారికి అభిషేకం

ధర్మపురి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణం

● స్వచ్ఛ భారత మిషన్ కింద 126 మంజూరు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మురికి కాలువలు నిర్మించక పోవడం, పూడిక తీత చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సామాజిక ఇంకుడు గుంతల (కమ్యూనిటీ సోకేపిట్) నిర్మాణం చేపట్టింది. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద 126 ఇంకుడు గుంతల లక్ష్యాలను కేటాయించారు. అత్యధికంగా మానకొండూర్‌లో 13, శంకరపట్నంలో 13 చొప్పున గంగాధర, రామడుగు, వీణవంక మండలాలకు 11 చొప్పున మంజూరు చేశారు. ఏగ్రామాల్లో ఎక్కడ నిర్మించాలని సర్వే చేసి స్థలాలు గుర్తించారు. గ్రామంలో ఏ



ఇంకుడు గుంత

మురుగు కాలువ నుంచి ఎక్కువగా నీరు వస్తుందో ఎక్కడ కాలువ ముగుస్తుందో అనే దానిపై అధికారులు పరిశీలించారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సేకరించి నిర్మాణాలు కూడా ప్రారంభించారు. ఇంకుడు గుంతలోకి చెత్త చేరకుండా ఫిల్టర్లు ఏర్పాటు చేస్తారు. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.92,797 చెల్లిస్తోంది. ఇందులో 70 శాతం ఎస్‌బీఎం రూ.64,916 వేల చెల్లిస్తుండగా మిగతా 30శాతం 27వేల 821 రూపాయలను 15వ ఆర్థిక సంఘం చెల్లిస్తుంది. ఇంకుడు గుంతల నిర్మాణంతో మురుగు సమస్య తీరుతుందని, స్థానికులకు దుర్వాసన బాధ తప్పుతుందని, దోమల బెడద ఉండదని ఎస్‌బీఎం అధికారులు పేర్కొంటున్నారు. భూమిలోకి నీరు ఇంకే సయానికి వివిధ దశల్లో శుద్ధి జరుగుతుందని, భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని, ఇలాంటి పథకాలను రైతులు, ఇంటి యజమానులు వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఉపాధి హామీలో కరీంనగర్ రూరల్ మండలం ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. అంతే కాకుండా యజమానులు ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకుంటేనే ప్రస్తుతం అనుమతులు జారీ చేస్తున్నారు.

● న్యూస్‌బాక్స్

వీణవంకలో డ్రంకెన్ డ్రైవ్

వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అరికట్టడంతో పాటు ఎన్నికల సమయంలో మద్యం అక్రమ రవాణా, నగదు పంపిణీకి అడ్డు కట్టవేసేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహన పత్రాలు సరిగా లేని వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆలయ నిర్మాణ పనులకు పూజలు

తిమ్మాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ 8వ డివిజన్‌లో శ్రీ పంచాయతన నూతన ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి దైవానుగ్రహం పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

జమ్మికుంటలో గంజాయి కలకలం

జమ్మికుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో గంజాయి కలకలం సృష్టిస్తోంది. గంజాయి సరఫరా చేస్తున్న యువకుడిని ఆబాది జమ్మికుంట రోడ్డులో స్థానికులు పట్టుకున్నారు. ఆతడి వద్ద ఉన్న మూడు గంజాయి ప్యాకెట్లు, సెల్‌ఫోన్ కింద పెట్టాలని సూచించారు. సదరు యువకుడు గంజాయి ప్యాకెట్లు నేలపై పెట్టాడు. పట్టుకున్న వ్యక్తులు ఎవరు, సరఫరా చేస్తున్న యువకుడు ఎవరనే వివరాలు తెలియాల్సి ఉంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

ఓదెలలో భక్తుల సందడి

ఓదెల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శైవ క్షేత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం వివిధ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో కోడెలతో ప్రదక్షిణలు నిర్వహించి, మొక్కులు సమర్పించారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు.

కరీంనగర్ కరసేవకులకు సన్మానం



బండి సంజయ్, గుజ్జ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్

కరీంనగర్‌టౌన్/భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శౌర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ కరసేవకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, గుజ్జ శ్రీనివాస్‌ను మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్ ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ చెందిన కరసేవకులు బాబ్రీ మసీదు వద్దకు చేరిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కాలంలో జరిగిన ఘటనలు దేశ రాజకీయ సామాజిక పరిణామాలపై ప్రభావం చూపాయన్నారు. ఆనాటి ఉద్యమ కాలంలో పాలు పంచుకున్న వేలాది కర సేవకుల పాత్ర, త్యాగాలు మరువలేనివన్నారు. ఎంతో మంది త్యాగ ఫలితమే ఈ రోజు అయోధ్యలో భవ్య శ్రీరామ మందిరం నిర్మాణం అన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గంగాధర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని గంగాధర, కురిక్యాలలో పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు చేపట్టాలన్నారు. విద్యుత్, తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎంపీడీవో దమ్మని రాము, ఎంపీవో ప్రత్యూష, గౌరి రమేష్, కార్యదర్శులు జ్యోతి, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించండి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలో కాంగ్రెస్ మద్దతుదారులను సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలిపించాలని ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు కోరారు. ఆదివారం చామనపల్లిలో ప్రచారం చేశారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

చొప్పదండి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ, రాగంపేట గ్రామాల్లో పోలీసులు ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, అభ్యర్థులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించవద్దని అన్నారు. ఎన్నికలు ముగిసేవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఓటర్లు సహకరించాలని కోరారు.

14న కోటా టాలెంట్ టెస్ట్

భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదిన కోటా టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కోటా పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ డి.అంజిరెడ్డి తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో స్కాలర్ షిప్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు హాజరుకావచ్చన్నారు. ప్రస్తుత సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తామని, ప్రతిభావంతులకు వంద శాతం స్కాలర్ షిప్ అందిస్తామని తెలిపారు. ఆదనంగా ఐఐటీ, జేఈఈ నీట్ ఒలింపియాడ్ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు ఆరోతరగతి నుంచే శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. రేకుర్తిలోని కోటా పబ్లిక్ స్కూల్‌లో ఈ పరీక్ష ఉంటుందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్కూల్ చైర్మన్ డాక్టర్ డి.అంజిరెడ్డి

గ్రామపాలన ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఉట్ల కృష్ణ

కరీంనగర్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉట్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా తమ్మిశెట్టి ఆంజనేయప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని రెవెన్యూభవన్‌లో జిల్లాలోని 16 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా జీపీవోలు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ కోశాధికారిగా కుమ్మరి హరీష్, మహిళా అధ్యక్షురాలిగా పెంటి మమత, ఉపాధ్యక్షులుగా శ్రీరాంచందన, వనిత, కార్యదర్శులుగా రామంచ జయశ్రీ, జమున, ప్రేమలత, జీశైలజ, భవాని, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా నీర్ల రేవంత్, నలువాల సాయికిషోర్, జెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జాఫర్, నూనె రమేశ్, ఆకుల అనిల్, పెండ్యాల సాగర్, నారాయణపురం రాజు, మంత్రి రాజు ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా పబ్బతి వెంకటరెడ్డి, గంధ నవీన్‌కుమార్, నాంపల్లి శ్రీనివాస్, నూనె శ్రీనివాస్, అనుమాండ్ల కిరణ్, జాయింట్ సెక్రెటరీలుగా మోకాళ్ల కొమురయ్య, పూరెల్ల మధుకుమార్, చరణ్ తేజ్, పబ్బతి రాజు, మిడిదొడ్డి శ్రీకాంత్, నాయిని మహేశ్, దూస సంపత్‌లు ఎన్నికయ్యారు. కల్చరల్ సెక్రెటరీలుగా బొమ్మగల సురేశ్, తాళ్ల వెంకటస్వామి, స్పోర్ట్స్ సెక్రెటరీలుగా భగవాన్‌రెడ్డి, తడిగొప్పుల సాయికృష్ణ, కార్య వర్గసభ్యులుగా జోగుల రమేశ్, రొడ్డ సురేశ్, బొల్లం సంపత్‌రెడ్డి, దాసారి రాము, అంతడుపుల రాజు, కూన రాజేందర్, దొనికెని సుమలత, బాలరాజు, దురుగుల మధుకర్, మమత, శైలజ, కె.రమేశ్, సముద్రాల శ్రీనివాస్, గోపు బాస్కర్ ఎన్నికైనట్లు ప్రకటించారు. అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ కందుకూరి బాపుదేవ్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందె రవీందర్, టీజీటీఏ అధ్యక్షులు బండి రాజేశ్వర్, టీజీఆర్ఎస్ఏ జనరల్ సెక్రెటరీ రమేశ్ పాల్గొన్నారు.

సాయి ఈశ్వరాచారికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో ప్రజాస్వామ్య బీసీ ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సాయిఈశ్వరాచారి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 42శాతం బీసీల రిజర్వేషన్ సాధన కోసం సాయిఈశ్వరాచారి ప్రాణత్యాగం చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాలు, బీసీ సంఘాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో ప్రణవ్

వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ హుజూరాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పుల్లూరి సారయ్య, సంపత్, పాకాల సంపత్, తిరుపతి ఉన్నారు. నాయకులు కోమల్ రెడ్డి, పుల్లూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న యాదగిరి శేఖర్‌రావు

గుడ్ నైబర్స్-గుడ్ సొసైటీపై సదస్సు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫిలింభవన్‌లో ఆదివారం సద్భావనాపోరం ఆధ్వర్యంలో గుడ్ నైబర్స్-గుడ్ సొసైటీ అంశంపై సదస్సు నిర్వహించారు. ఫోరం అధ్యక్షులు దిండిగాల మహేశ్, వంగపల్లి రాజేశ్వర్ అధ్యక్షతన ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, డిస్ట్రిక్ట్ అకాడమిక్ కో ఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, జమాతే ఇస్లామి హింద్ బాధ్యుడు ఖైరొద్దీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జయరాజ్, రామచంద్ర మిషన్ ప్రతినిధి సింగమరాజు పాల్గొన్నారు.

అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలి

తిమ్మాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నియమావళిని పాటించాలని ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులకు మండలంలోని కొత్తపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎన్నికల ఖర్చుల సహాయ అధికారి అవగాహన కల్పించారు. సర్పంచ్ అభ్యర్థి గరిష్ఠంగా లక్షా 50 వేల రూపాయలు, వార్డు సభ్యులకు గరిష్ఠంగా 30వేల రూపాయలు ఖర్చు పరిమితి మాత్రమేనని సూచించారు. ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థి నామినేషన్ సమయంలో చూపించిన బ్యాంకు ఖాతాను మాత్రమే ఎన్నికల ఖర్చుకు వినియోగించుకోవాలని, రూ.50వేల లోపు ఖర్చు నగదు రూపంలో చెల్లించాలని, రూ.50వేల ఖర్చు దాటితే తప్పనిసరిగా చెక్కు ద్వారానే చెల్లింపులు చేయాలని అన్నారు. అభ్యర్థి చూపించిన ఖర్చు గరిష్ఠ పరిమితి దాటితే ఎన్నిక రద్దు చేసే అవకాశం ఉంటుందని సూచించారు. ఎన్నికలు ముగిసిన 45 రోజుల లోపు అభ్యర్థులు ఖర్చులను అధికారులకు సమర్పించాలని, లేకపోతే అనర్హత వేటు వేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. అభ్యర్థులందరు ఎన్నికల నియమావళిని లోబడి ఉండాలని అన్నారు.



మాట్లాడుతున్న తిమ్మాపూర్ ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర

భాగవతం చదివినా.. విన్నా పుణ్యం



ప్రవచనం చేస్తున్న మేహెర్‌రాజ్‌శర్మ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భాగవతం చదివినా, విన్నా పుణ్యం దక్కుతుందని, సనాతనధర్మ సమ్మోహన్‌దాయకమని ఆదిలాబాద్‌కు చెందిన పతంజలి మేహెర్‌రాజ్‌శర్మ అన్నారు. నగరంలోని వైశ్యభవన్‌లో సుధామ వాకింగ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన భాగవత ప్రవచనాన్ని ప్రారంభించారు. భాగవతం కేవలం ఒక గ్రంథం మాత్రమే కాదని, జీవిత సత్యాలను, ధర్మాన్ని ప్రతిబింబించే విజ్ఞాననిధి అని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బోనగిరి శ్రీనివాస్, చింతకింది శ్రీనివాస్, గంప కైలాస్, గుఱ్ఱం రవి, బండం అశోక్, శ్రోతలు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ సంబరాలు



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని అంధుల, బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం వైఎంసీఏ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా ఆడిట్ ఆఫీసర్ సిహెచ్ జోయల్ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ జాన్, తిమోతీ, సరళ, సొలొమోను, సంజయ్, నికోలస్, బాస్కర్, వినయ్, ప్రభాకర్, ప్రసన్నకుమార్, జయకర్, రాజచందర్, పింటు పాల్గొన్నారు.

సమానత్వం ప్రాతిపదికన జీవనయానం సాగించాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యక్తి సమానత్వం ప్రాతిపదికన జీవనయానం సాగించాలని, కుల, ఉపకులాల్లో ఉన్న ఆచార వ్యవహారాలను, జీవన సరళిని గౌరవించడం నేర్చుకోవాలని సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, అఖిల భారత సమరసతా కళా ప్రముఖ్ అప్పాల ప్రసాద్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో కె శ్యాంప్రసాద్ రచించిన మనము-మన భారత రాజ్యాంగం-ప్రత్యేకతలు అనే పుస్తకం, తాను రాసిన సంస్కృతి విలువల ప్రదాతలు-శాసోరుల సంచార జాతులు అనే పుస్తకం, సంస్థ ముద్రించిన సమరసత సాధనలో సకల ప్రయత్నాలు-తెలంగాణ అనే పుస్తకం ఆవిష్కరణలో మాట్లాడారు. వేదిక జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, పుల్లూరి రామారావు, సంధ్య రమాదేవి, పెండెం శ్రీనివాస్, పురుషోత్తం, శ్రీహరిరెడ్డి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పోటీకే సై..

(5వ పేజీ తరువాయి)

కనిపిస్తున్నది. ఓటుకు 500 నుంచి రెండు వేల రూపాయల వరకు ఖర్చుపెట్టేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఆయా పంచాయతీల్లో ఉన్న ఓట్లను పార్టీలవారీగా, కులాలవారీగా విభజిస్తున్నారు. ఏ వర్గానికి ఎవరి ద్వారా డబ్బులు అందించాలి, ఎవరి నేతృత్వంలో ఆయా వార్డుల్లో ప్రచారం నిర్వహించాలి అన్నది నిర్ణయించుకుని బాధ్యతలు అప్పగించారు. కుల, యువజన సంఘాల వారితో సమావేశాలు నిర్వహిస్తూ విందులను ఏర్పాటు చేస్తూ డబ్బు పంచే బాధ్యతను అప్పగించేందుకు పథకాలు రూపొందించుకున్నారు.

● మొదటి విడత పంచాయతీల్లో హోరాహోరీ

మొదటి విడత ఎన్నికలు మరో నాలుగురోజుల్లో జరుగనుండగా ఆయా గ్రామపంచాయతీల్లో ఇప్పటికే మందు, డబ్బు పంపిణీ ప్రారంభమైందని సమాచారం. రెండో విడత ఎన్నికలు జరగడానికి ఆరు రోజులు, మూడో విడత ఎన్నికలు జరుగడానికి తొమ్మిది రోజుల గడువు మాత్రమే ఉండడంతో పోటీలో ఉన్నవారంతా వ్యక్తిగతంగా ఇంటింటికి వెళుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ తమకు వచ్చే ఓట్లను అంచనా వేస్తూ ఆ ఓట్లు ఇతరుల ఖాతాలో చేరకుండా చూసుకుంటున్నారు.

చెరువు నీటి వృథా అరికట్టాలి



వీణవంకలో మాట్లాడుతున్న మత్స్యకారులు

వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్తి వీణవంక గ్రామాల మధ్య పెద్ద చెరువు నీటి వృథాని అరికట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఆదివారం మాట్లాడుతూ చెరువు నుంచి నీరు వృథాగా వెళ్తుండడంతో నీటి నిలువ తగ్గి చేపల పెంపకానికి ఇబ్బందిగా మారిందని ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. చెరువు నీటిపై దాదాపు 200 మంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నీటిని కిందికి విడుదల చేయడంతో నీటి నిలువలు తగ్గుతున్నాయన్నారు. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మోటం వెంకటేశ్, నాయకులు కుమారస్వామి, రవీందర్, రామ్, సదానందం, కొండయ్య సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌తో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అబాకస్ నేర్చుకోవడంతో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని, సృజనాత్మకత, జ్ఞాపకశక్తి పెంపొందుతాయని మ్యాథ్స్‌పై ఉన్న భయం తొలగుతుందని మోటివేషన్ స్పీకర్ శ్రీహరి అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విశ్వం ఎడ్‌టెక్ ఆధ్వర్యంలో అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 50 పాఠశాలల నుంచి 590 మంది విద్యార్థులు హాజరయ్యారు.వీరిలో ప్రతిభకనబరిచిన 31 మంది జనవరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని విశ్వం ఎడ్‌టెక్ రీజనల్ హెడ్ వినాయక్ తెలిపారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ చాలా మంది పిల్లలకు మ్యాథ్స్ అంటే భయం ఉంటుందని, అబాకస్ నేర్చుకోవడం ద్వారా భయం పోయి ఉత్సాహంగా ఎదిగేందుకు దోహదపడుతుందని అన్నారు.

ఉచిత వైద్య శిబిరం

భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మంకమ్మతోట రామ చంద్ర మిషన్ హార్ట్‌పుల్ నెస్ ధ్యాన కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో హైదరాబాద్‌లోని కన్హ శాంతి వనంలోని వెల్నెస్ సెంటర్ వైద్యులు 250 మందికి పరీక్షలు చేశారు. ఆయుర్వేద కన్సల్టేషన్, నాడి పరీక్ష, నేచురోపతి, కన్సల్టేషన్, డైట్ కౌన్సెలింగ్, ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. వెల్నెస్ సెంటర్ వైద్యులు రఘువీర్, సంపూర్ణ, చంద్ర శేఖర్, జైసాయిమోహన్, మానస, హార్ట్ ఫుల్ నెస్ శ్రీరామచంద్రమిషన్ జోనల్ కో-ఆర్డినేటర్ వెంకటరమణ, కరీంనగర్ సెంటర్ కో-ఆర్డినేటర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్‌నగర్ హెలిప్యాడ్ గ్రౌండ్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు దంపతులు, ఆలయ కమిటీ బాధ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో మాజీ మేయర్ సునీల్‌రావు దంపతులు

వైరాగ్యం ప్రభాకర్‌కు సన్మానం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కవి, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్‌ను ఆదివారం సూర్యాపేటకు చెందిన శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ కవి సమ్మేళ నంలో సన్మానించారు. అధ్యక్ష కార్యదర్శులు పోతుగంటి వీరాచారి, మాదుగుల జార్జికుమార్, వేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ సన్మానం అందుకున్నారు.

కూడళ్ల సుందరీకరణలో అవినీతి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన కూడళ్ల సుందరీకరణ కోసం కోట్లాది రూపాయలను నీళ్లలా ఖర్చు చేశారని, ప్రతీ కూడలిలో రివైజ్డ్ ఎస్టిమేట్లతో లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని మాజీ కార్పొరేటర్ బండారి వేణు ప్రకటనలో ఆరోపించారు. గతంలో గాంధీ కూడలిలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి కాంట్రాక్టర్ నుంచి డబ్బులు రికవరీ చేయించిన కమిషనర్, వ్యవసాయ మార్కెట్ కమిటీలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులపై విజిలెన్సు విచారణకు సిఫారసు చేయించడం హర్షణీయమన్నారు. అలాగే ఇందిరాచౌక్, వన్‌టౌన్ ముందు, పద్మనగర్ కూడళ్లలో అవినీతిపై కూడా సమగ్ర విచారణతోపాటు విజిలెన్సు విచారణకు సిఫారసు చేసి అవినీతికి అడ్డుకట్ట వేయాలని కోరారు. ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రజాధనాన్ని కాజేశారని, దీనిపై అనేక సార్లు ఫిర్యాదు చేసినా స్పందించక పోవడం బాధాకరమన్నారు. రూ.60 లక్షల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఇందిరా కూడలి సుందరీకరణ పనులను రివైజ్డు ఎస్టిమేట్‌తో కోటి రూపాయలకు పెంచి బిల్లులు తీసుకున్నారని, ఇందులో రూ.60 లక్షల పనులు కూడా జరగలేదని పేర్కొన్నారు. వన్‌టౌన్ కూడలిలో రివైజ్డ్ ఎస్టిమేట్లతో బిల్లులు ఇచ్చేందుకు అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని యథాస్థానంలో ఇంకా పెట్టలేదని తెలిపారు. వెంటనే విగ్రహాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. పద్మనగర్ జంక్షన్ నిర్మాణ పనులు పూర్తికాకుండానే రూ.కోటి 81 లక్షలతో బిల్లులు అప్పగించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసిందని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు.